# ప్రవాసాంధ్రుల పేజీ

- సాక్షి.

## సెయింట్‌లూయిస్ ఇండియా సంఘం నిర్వహించిన వసంతోత్సవము

**వేదిక : మహాత్మ గాంధి కల్చరల్ సెంటర్.**

**సమయం : మే 3వ తేదీ, 2008 సాయంత్రము 4:30 గంటల నుండి.**

సెయింట్‌లూయిస్ ఇండియా సంఘం నిర్వహించిన వసంతోత్సవ కార్యక్రమము మహాత్మాగాంధి సెంటర్‌లో మే 3 వతేదీన దాదాపు 300 మంది ప్రేక్షకుల సమక్షంలో ఆద్యంతమూ విజయవంతముగా సాగింది. మధ్యాహ్నం 4:30 నుండి 6 గంటలవరకు తినుబండారముల విక్రయము, పరిచయ కార్యక్రమములు కొనసాగగా, సాయంత్రము 6 గంటలకు పలు శాస్త్రీయ నృత్యములతో, శాస్త్రీయ సంగీతముతో, సినిమాలకు సంబంధించిన పాటలతో, నృత్యములతో, జానపద గీతములతో, జానపద నృత్యములతో కూడిన సాంస్కృతిక కార్యక్రమములు ప్రేక్షకుల హర్షధ్వానాల మధ్య కొనసాగాయి.

## మానవాళికి మండోదరి సందేశము అనే అంశముపై గోలి ఆంజనేయులు గారి ప్రసంగము

**సమయము: మే 18, 2008 సాయంత్రము 5 గంటల నుండి 7 గంటల వరకు.**

**వేదిక : సెయింట్‌లూయిస్ వైదిక దేవాలయము.**

డాక్టర్. గోలి ఆంజనేయులుగారు సెయింట్‌లూయిస్ నగరమునకు విచ్చేయడం, వారి విలువైన సమయములో కొన్ని గంటలు రామాయణ, భాగవత ప్రవచనాలతో అలరించడం ప్రమోదం. ఈ రోజు ప్రవచనము 'మానవాళికి మండోదరి సందేశము' అన్న అంశముమీద. 'మానవాళికి మండోదరి సందేశమా?' అని ఆశ్చర్యపోవడం అసాధారణమేమీ కాదు. రావణాసురుని సతి ఏమి సందేశమిచ్చి ఉంటుంది? ఆంజనేయులుగారు వివరించిన విశేషములను బట్టి, ఆమె తన భర్త అయిన రావణునికి ఏమి చేయతగదో తెలియజేసింది. కాని రావణాసురుడు మండోదరి మాటలు పెడచెవిని పెట్టాడు. పర్యవసానం మనకందరకూ తెలిసినదే. ప్రాత: సమయములో స్మరించదగ్గ వ్యక్తుల జాబితాలో మండోదరి పేరు కూడా ఉన్న విషయమును ప్రస్తావిస్తూ - రావణుడు అహంకారము, కామము కారణముగా ధర్మవిరుద్ధమైన పనులు చేస్తున్న విషయమును ఆమె గ్రహించి, ఎన్నో సందర్భములలో అతనిని మందలించడం జరిగింది. కాని ఆమె మాటలపై అతను శ్రద్ధ వహించలేదు. తత్కారణముగా అతను తన తప్పులకు తానే బలైపోయాడు. అతని కారణముగా మణిమయభూషితమైన, సుందరమైన లంకానగరం నాశనమైంది. ఈ సందర్భములో ఆయన సందర్భోచితమైన కొన్ని శ్లోకములను, వాటి అర్థమును తెలియజేసారు. సెయింట్‌లూయిస్ వైదిక దేవాలయము తరపున శ్రీమతి అఖిలా బలరాంగారు వారికి ధన్యవాదములు తెలియజేసారు.

*గంగ, గోదావరి, కృష్ణ, కావేరి, తుంగభద్రలు పంచగంగలు.*

**శ్రీ గోలి ఆంజనేయులు గారి భగవద్గీతా ప్రవచనాలు**

**సమయము: మే 26వ తేది 2008 సాయంత్రము 5 గంటలనుండి 7 గంటలవరకు.**

**వేదిక : సెయింట్‌లూయిస్ హిందూ దేవాలయము.**

డాక్టర్. ఆంజనేయులుగారు తమ భగవద్గీత ప్రవచనాల ద్వారా సెయింట్‌లూయిస్ జనులను ఆశీర్వదించారు. మే 26, సెలవు దినమును పురస్కరించుకుని, ఈ ప్రవచనకార్యక్రమమును ప్రారంభించారు. తరువాత ప్రతి ఆదివారము ఈ కార్యక్రమము కొనసాగుతుందని, ప్రతి వారము ఒక అధ్యాయము చొప్పున 18 అధ్యాయములపై ప్రవచనాన్ని కొనసాగిస్తారని తెలియజేయడం జరిగింది. ఆంజనేయులుగారు తనదైన బాణిలో శ్రోతలను తన్మయులను చేసారు. భగవద్గీత ప్రవచనములు వినడము పూర్వజన్మ సుకృతము వల్లనే సాధ్యం. ఈ ప్రవచనాలు వినడము వలన వ్యక్తిత్వ విలువలు పెరగడము మాత్రమే కాక, వారి జీవితములో ప్రతిక్షణము నాణ్యత తొణికిసలాడుతుందనడములో సందేహములేదు. పిల్లలు ఈ ప్రవచనములు వినడమువలన వారిలో క్రమశిక్షణ అలవడుతుంది. మహా భారత సంగ్రామము ప్రతి వ్యక్తి జీవితములో జరిగేదే. ఆ యుద్ధంలో గెలుపు పొందడానికి శ్రీకృష్ణుడు భగవద్గీత రూపములో ఎన్నో యోగములను తెలియజేసాడు. గురుపూర్ణిమ సందర్భములో జగద్గురువువైన ఆ జగన్నాధుని, గురు పరంపరను స్తుతిస్తూ, 'కృష్ణం వందే జగద్గురుమ్' అందాం.

ఆంజనేయులుగారు జులై మొదటి వారములో జరిగిన ఆటా మహాసభలలో ప్రసంగములు గావించారు. ఆయన ఎన్నో పత్రికలకు వ్యాసములు వ్రాయడము జరుగుతున్నది. ఎందరో పాఠకులు వారి వ్యాసములను చదవడము జరుగుతున్నది. ఆంజనేయులుగారి వ్యాసములకు www.telugupeople.com ను సందర్శించండి.

*** *** ***

**విలువలకొఱకు పాదయాత్ర**

**తేది : జూన్ 20, 2008 సమయము : ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2:30 వరకు.**

**వేదిక : 1455 E. College Ave., St. Louis, MO 63107.**

నెయ్‌బర్‌హుడ్ హౌసెస్ మరియు యునైటెడ్ చర్చ్ ఆఫ్టర్ స్కూల్ ప్రోగ్రామ్ 5 సంవత్సరములకు పైగా సత్యసాయి హ్యూమన్ వాల్యూస్ కార్యక్రమమును అమలుచేసి, తద్వారా పిల్లలలో మంచి నడవడిక, మార్పు కలుగడానికి, వారి జీవితములు విజయవంతము అవ్వడానికి తోడ్పడింది.

ఈ కార్యక్రమములో పాల్గొనడంద్వారా సత్యసాయి ఎడ్యుకేషన్ ఇన్ హ్యూమన్ వాల్యూస్ (SSEHV) కార్యక్రమము గురించి అవగాహన తెప్పించేందుకు మరియు ఆ విలువలను ఆచరించడమువలన నిత్యజీవితములో పొందే ప్రయోజనమును తెలియజెప్పేందుకు అవకాశము కలిగింది. కార్యకర్తలు పడవ నమూనాను, విలువల బానర్లను తయారు చేసి ఈ నడకలో పాల్గొన్నారు.

*లంకా నగరం మరెక్కడో లేదు. మన మణిపూరక చక్రమే లంకానగరం. వివరములు వచ్చే సంచికలో...*

కొన్ని ఆటలను, ఫేస్ పెయింటింగ్, నృత్య ప్రదర్శనలను ఏర్పాటుచేసారు. ఈ పాదయాత్ర 9:15 నిమిషములకు మొదలై, ఇంచుమించు 1.3 మైళ్ళ దూరం సాగింది.

*** *** ***

**అంతర్జాతీయ కూచిపూడి నాట్య సమ్మేళనం**

**తేది : జూన్ 20, 2008 నుండి జూన్ 22 వరకు.**



క్యూపర్టినో నగర వీధులలో కూచిపూడి శోభాయాత్ర

ప్రక్క ఛాయాచిత్రము భారతదేశములో తీసినది కాదు సుమండి. ఇది కాలిఫోర్నియాలోని క్యూపర్టినో నగర వీధులలో జరిగిన వేడుకలు. సిలికాన్ ఆంధ్ర సంస్థ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృతిక శాఖ, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయము సంయుక్త నిర్వాహణలో కూచిపూడి నాట్య సమ్మేళనము జరిగింది. సిలికాన్ ఆంధ్ర సంస్థ వందలాది కూచిపూడి కళాకారులను ప్రపంచం నలుమూలలనుండి ఆహ్వానించి ఈ కార్యక్రమమును విజయవంతముగా నిర్వహించింది.

**ఈ నాట్య సమ్మేళనమునకు సంబంధించిన విశేషాలు:**

- ఐదు తరాల కళాకారులు ఒక చోట సమావేశము కావడం.
- సంప్రదాయబద్ధముగా కళాకారులకు ఘనమైన స్వాగతం.
- గురుపూజోత్సవము.
- కూచిపూడి శోభాయాత్ర.
- రధోత్సవము.
- అద్భుతమైన కూచిపూడి నాట్య ప్రదర్శనలు.
- కూచిపూడి పేరు గిన్నిస్ ప్రపంచరికార్డుల జాబితాలోకి చేర్చబడడం.
- అమెరికాలో మొట్టమొదటి యక్షగాన ప్రదర్శన.
- ఆలోచింపజేసే ఎన్నో ప్రసంగాలు.




కూచిపూడి గురుపరంపరకు 'వంద'నములు. గురుపూర్ణిమ శుభాకాంక్షలతో...

*